**భట్టిప్రోలు నాగసుందరి స్మారక సంక్రాంతి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

# హీరో

**కాటూరి రవీంద్ర త్రివిక్రమ్**

సుందరికి అభిమాన హీరో చిరంజీవి. ఒక్కో సినిమా కనీసం అయిదారుసార్లు చూస్తుంది. చూసినప్పుడల్లా ఊహల్లో కలల్లో తేలిపోతుంటుంది. తను చిరంజీవితోబాటు ఆడుతున్నట్లు, పాడుతున్నట్లు.. ఇంకా చాలా చాలా ఊహిస్తుంది. అవన్నీ చెప్పాలంటే ... ఉహూం ... ఎలా చెబుతుంది? కేవలం చిరంజీవితోనే అవన్నీ చెబుతూంటుంది... ఊహల్లో కలల్లో ... ఇంకెవరికన్నా చెబితే హేళన చెయ్యరూ?

ఏందే... పనిమానేసి కలలుకంటా ఉండావూ; కానీ కానీ ... అవతల అయ్యగోరు సూసారంటే .. ఉంటది నీపని" సుబ్బుడు గేదెల్ని కడుగుతూ హెచ్చరించాడు. చప్పున తేరుకుని, తొట్లో కుడితి కలిపింది. అదో కమ్మని వాసన... గేదెలు ముట్టెలు ముంచి, ఊపిరి బిగపట్టి, కుడితిని జుర్రు కున్నాయి. ముట్టె బయటికి తీసి బిగపట్టిన ఊపిరి వదులుతూ, మళ్లీ తాగసాగాయి. వాటికేసే చూస్తూ కూచుంది, సుందరి.

సుబ్బుడు గేదెల పాక శుభ్రం చేస్తూ, కాలక్షేపంపాటపాడుతున్నాడు. అంతలో అయ్యగారి కేక వినిపించింది. వెంటనే చేతిలో పని వదిలిపెట్టి పరుగుతీశాడు. "వస్తన్నా అయ్యా" అంటూ. సుందరికి నవ్వొచ్చింది. సుబ్బుడు తన మేనబావ. అమాయకత్వం మూర్తీభవించినట్లుంటాడు. అయ్యగారంటే తగని భయం. అడుగులకి మడుగులొత్తినట్లు సేవలు చేస్తాడు. సుబ్బుడికి తననిచ్చి పెళ్లి చెయ్యాలని అమ్మానాన్నల ఆలోచన. ప్చ్... తనకిమాత్రం హీరో చిరంజీవిలాటి కుర్రాడ్ని చేసుకోవాలని ఒకటే ఇది... చిరంజీవి ముందు సుబ్బడెందుకు పనికొస్తాడు? ఎదురొచ్చినోళ్లని ఇరగబొడి చేస్తాడు హీరో చిరంజీవి.. ఆ స్టయిలే స్టయిలు... మళ్లీ ఒకసారి చిరంజీవి రూపాన్ని తలుచుకుని నవ్వుకుంది సుందరి.

" సేయ్.. తర్వాత నవ్వుకుందూ గాని... అవతల అయ్యగారు పిలుత్తున్నారు ఎళ్లు .. " మళ్లీ తన పనిలో పడ్డాడు సుబ్బుడు.

"ఎల్తన్నాలే... " తన ఊహల్ని పాడుచేసినందుకు చిరాకుపడుతూ, అయిష్టంగా వెళ్లింది. అయ్యగారికి అయిదుతరాలకి సరిపడా ఆస్తి ఉంది. లంకంత కొంప ఉంది. మండోదరిలాంటి పెళ్లాం, రావణుడికున్న దురలవాట్లూ వున్నాయి. రోజులో ఎక్కువ కాలం తాగుడు.. సిగిరెట్లు.. టీవీలో బూతుబొమ్మలు చూట్టం.. ఇవే వ్యాపకాలు.. ఆయన గదిలోకి వెళ్లాలంటేనే కంపరం.

"ఏంటయ్యా?" అంది గుమ్మంలో నిలబడి సుందరి.

"గదంతా శుభ్రం చెయ్యి "

"సుబ్బడ్ని పంపనా?!"

"నువ్వే చెయ్యి..." ఇహ తప్పదన్నట్లు కుచ్చిళ్లు పైకి దోపి, శుభ్రం చెయ్యటం మొదలెట్టింది.

★ ★ ★

సుబ్బుడు ఉలిక్కిపడ్డాడు. అవును అది సుందరి గొంతే! పెద్దగా అరుస్తోంది. అవి మామూలు అరుపులు కావు... ఆపదలో ఉన్నప్పుడు పెట్టే కేకలు... వెంటనే అదరాబాదరా అయ్యగారి గదివైపు పరుగు తీశాడు.

అక్కడి దృశ్యం చూసి అదిరిపడ్డాడు.

సుందరి ఒంటిమీద సగం బట్టలు లేవు. అయ్యగారి చేతిలో గింజుకుంటోంది. ఎలుగుబంటుకి తేనె తుట్టె దొరికినట్లు ఎగబడుతున్నాడు అయ్యగారు.

సుబ్బడికి పూనకం వచ్చినట్లు అమాంతం వెళ్లి అయ్యగారి చేతుల్లోంచి సుందరిని విడిపించాడు. కామంతో కంపుకొడుతున్న అయ్యగారు కోపంగా సుబ్బడిని ఎడాపెడా కొట్టాడు.

సుబ్బడికి ఆవేశం పొంగి వచ్చింది. తిరగబడ్డాడు. ఎక్కడ అందితే అక్కడ కొట్టాడు. ఊహించని ఈ పరిణామానికి దిమ్మెరపోయి, మంచం మీద కూలబడ్డాడు అయ్య గారు అనబడే రాయుడు. " ఒరేయ్... నిన్ను చంపేస్తా " అన్నాడు చల్లారని కోపంతో, మరోపక్క అయాసంతో రొప్పుతూ.

" పోరా... ఆట్టే మాట్లాడితే నేనే చంపుతా... ఇప్పుడే... ఇక్కడే"...


చదివేది చదివించేది చదవాలని అనిపించేది

చినుకు మాసపత్రిక

చందాదారులు కండి!